"అయితే కుక్క అక్కడ మళ్ళీ దొరకలేదన్న మాట!"

"లేదు——"

"కుక్క ఖరీదెంత?"

"అంటే?"

"ఎంత యిచ్చికొన్నారూ? అని"

"ఎనిమిది!"

"ఎనిమిది?" అన్నాను మళ్ళీ.

తరవాత యీ ప్రసక్తి నాదగ్గర ఆయనగానీ ఆయనదగ్గర నేనుగానీ తేవటం పడలేదు.

స్కెచ్

# కాంక్ష

"హితశ్రీ"

ఎస్. మురళీధరరావు అనే వ్యక్తితో నాకు పరిచయం అయేదాకా, అర్థంకాని వ్యక్తులంటూ కొంతమంది ఉంటారని నాకు తెలియదు. ఈ వ్యక్తిని గురించి తల బద్దలుకొట్టుకునే అగత్యం అనవరతమూ కలుగుతుందని ముందే తెలుస్తే అతనితో అంత పరిచయం కలిగించుకొనక పోయే ఉందును. పరిచయం అయిన తరవాత అతనిని తప్పించుకుని తిరగాలిసిన ఆవశ్యకత చాలామట్టుకు కలిగింది. లేకపోతే, బుద్ధి పూర్వకంగా మెదడు పాడు చేసుకోవాలని ఎవరు కోరుకుంటారు? అయితే తప్పించుకు తిరగటమనేది ఇద్దరికీ సంబంధించిన విషయం. నా చేతిలో పనైతే నేను చేస్తూనే ఉన్నానుకాని అతను సులభంగా అది నెరవేరనిచ్చేట్లులేడు. మురళీధరరావుని ఆ రోజు పొద్దున గుమ్మంలో చూడగానే నాకు కలిగిన మనోభావం అదీ. అతను పూర్తిగా ఇంటిలోకి అడుగుపెట్టకుండానే చేతిలోని పేపరు నామీదికి విసిరేస్తూ అన్నాడు ఉత్సాహంగా.

"చూశావా, ఫస్టుప్రైజు పదిహేను వేలుట-ఎస్. మురళీధరరావు."

"మవ్వేనా?" అన్నాను చాలా యథాలాపంగా.

"కాకపోతేమటుకేం?"

"అయితే నీకెందుకంత ఉత్సాహం?"

అతను ఏమీ మాటాడకుండా తాపీగా కుర్చీలో కూచున్నాడు.

"దీనికోసమేనా ఇంత హడావుడిగా పరుగెత్తుకొచ్చావు?"

"నీకు చెబితే అర్థంకాదులే."

"అర్థం ఉంటేగా, కావటానికి."

"టీపార్టీ ఇప్పిస్తానులే."

"ఎవరికో ప్రైజురావటమేమిటి, మధ్య నీకూ నాకూ టీపార్టీ ఏమిటి? అదైనా నీ సొంతఖర్చుమీద!"

మురళీధరరావు నవ్వాడు. అది భావయుక్తం అని వాడి అభిప్రాయం.

"ఈ ఏడు చెస్ ఛాంపియన్‌షిప్ ఎవరిదో తెలుసా? మధ్య పేజీ తిప్పు."

తిప్పాను.

"ఎస్. మురళీధరరావు, నువ్వు కాదుగా." కొంచెం అనుమానంగా అడిగాను.

"నాకు చెస్ ఆట ఎలాఆడాలో తెలిస్తేగా?" నవ్వాడు.

"నువ్వు ఎరుగుదువా అతన్ని?"

"నీకెంత తెలుసో నాకూ అంతే తెలుసు."

"మరి, అంత సంతోషం ఎందుకు నీకు? అతని ఆరాధకుడివా?"

మురళీధరరావు మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ వినని వాడిలా పైకిచూసి, కాసేపాగి హఠాత్తుగా లేచి నుంచున్నాడు.

"పద, పోదాం. ఇవాళ రెండు సంతోషకరమైన వార్తలు, తప్పక నీకు కాఫీ ఇప్పించాలి."

అతని వాలం చూసి నాకు వొళ్లు మండింది. అయినా ఊరికే పరాయి ఖర్చుమీద కాఫీ రావటం అనేది నాకు సామాన్యంగా అసామాన్యం కనుక తిరస్కరించటానికి బుద్ధి పుట్టక అతనితో బయలుదేరాను కాఫీ తాగింతరవాత ఇంటికి రమ్మని బలవంతం చేశాడు. వెంటనే కృతఘ్నత తెలియచెయ్యటం అమర్యాదకరమని తప్పనిసరిగా అతనిని అనుసరించాను. పది నిమి

పాలు ఏదో వూకదంపుడు దంచి "ఇప్పుడే వొస్తాను, కూర్చో" అని లోపలికి వెళ్ళి ఓ ఫైలు తీసుకొచ్చి నాముందు పడేశాడు. "ఏమిటి?" అన్నాను ఆశ్చర్యంగా. చదవమన్నాడు. ఆ ఫైలు నిండా పేపరు కత్తిరింపులున్నాయి. విసుగు పుట్టింది.

"నాకు ఓపికలేదు, నువ్వేచదువు. వింటాను" మాట్లాడకుండా ఫైలు తీసుకున్నాడు.

"'ప్రఖ్యాత చిత్రదర్శకుడు ఎస్. మురళీధరరావుకు అఖండసన్మానం'..."

"ఏం అయితే?"

"ఎస్. మురళీధరరావు!" ప్రసన్నంగా ముఖం పెట్టి అన్నాడు. అతని ముఖంలోకి తేరి పార చూశాను. మళ్ళీ ఇంకో కటింగ్ చదివాడు.

"అంతర్విశ్వవిద్యాలయాల వక్తృత్వపు ప్రథమ బహుమానం ఎస్. మురళీధరరావు."

"దయచేసి వివరాలుమాత్రం చదవకు" అన్నాను తల రెండుచేతుల్లో పట్టుకుని అప్పుడే బుర్ర ఆలోచించటం మొదలుపెట్టింది...అతను చదువుతూనే ఉన్నాడు.

"ఎస్. మురళీధరరావు పి. హెచ్. డి (లండన్) యూరపుదేశాల పర్యటనానంతరం స్వదేశానికి తిరిగి రాక..."

తరువాత ఇక వినదలచుకోలేదు. జవాబులేని ప్రశ్న మనసులో విరిగిన ముల్లులా బాధ పెడుతోంది. ఎవరో ఎస్. మురళీధరరావుట-ఎందరో, ఇతను వాళ్లని ఒక్కసారికూడా వ్యక్తిగతంగా చూడలేదు. ఇతనికి అంత ఉత్సాహం ఎందుకు? పూర్వం ఎన్నోపుస్తకాలు తిరగేశాను. జవాబు లేదు.

మర్చిపోదామనుకున్నాను, మర్చిపోనియ్యడు.

"చూశావా!" అన్నాడు తెప్పరిల్లాను.

"ఏమిటి?"

"అంతర్జాతీయ ఆటల పోటీలో-టెన్నిస్ ఛాంపియన్ ఎస్. మురళీధరరావు ఓటమి." చాలా జాలికరంగా అన్నాడు. కేవలం తనే ఓడిపోయినట్టుగా ముఖంపెట్టాడు.

"మధ్య నీకేం?" అన్నాను కోపంగా.

"ఏమిటో!" అర్థస్వగతంగా అన్నాడు.

దీనికంతా నాకు ఒకే కారణం తోస్తోంది. బహుశా ఉన్మాదావస్థకిది ప్రారంభదశేమో!

"ప్రఖ్యాత విద్యావేత్త ఎస్. మురళీధరరావు అకాలమరణం" ఇక చదవలేక పోయాడు.

"నువ్వు చావలేదుగా, నీకెందుకు ఏడుపు?"

"చచ్చినవాడెప్పుడూ ఏడవడు" అన్నాడు కొంచెం నొచ్చుకున్నట్టు.

"నీ సంగతేం బోధపడటం లేదు నాకు."

"పాపం, అతను ఈ పబ్లిసిటి చూడలేదుకదా! నిజంగా చాలా గొప్పవాడోయ్."

"కావొచ్చు. నువ్వూగొప్పవాడివే."

అతను పొడిగా నవ్వాడు. అర్జెంటు పని ఉందని వొచ్చేశాను. తరువాత మళ్లీ అతన్ని చాలారోజులవరకూ కలుసుకోలేదు. ఈ లోపుగా ఇంకా కొన్ని పుస్తకాలు చదివాను. మనస్తత్వ శాస్త్రంమీద అంతగా ఉపకరించలేదు.

మురళీధరరావు తరవాత ఓ తమాషా పుస్తకం ప్రచురించాడు. అందులో కొందరు వ్యక్తుల చరిత్రలు బొమ్మలతోసహా ఉన్నాయి. అందరూ ఒక్కొక్క శాఖలో ఉన్నతి అందుకున్నవారు. తమాషా ఏమిటంటే అందరి పేర్లూ ఎస్. మురళీధరరావు అనే ఉన్నాయి. సంపాదకుడు ఎస్. మురళీధరరావు. నాకు కాఫీ ఇచ్చాడు, అభిప్రాయం చెప్పమని. ఏమనాలో తెలియలేదు.

పత్రికల్లో అతని పుస్తకంమీద వ్యాఖ్యలూ. విమర్శలూ వొచ్చాయి. కొత్తపద్ధతి, గొప్పగా ఉందన్నారంతా. పైకి వింతగా ఉన్నా విషయ ప్రాముఖ్యం ఉందన్నారు. దాదాపు అన్ని పత్రికలూ, ఆ పుస్తకంలో ఉదహరించబడ్డ వ్యక్తుల్ని ప్రశంసిస్తూ దేశానికి యువకులు అలా సేవచేయాలనీ, ఇదే సంపాదకుని ఆశయం అయి ఉంటుందనీ ఉద్ఘాటించాయి, ఈ పుస్తకానికి ఇంత ఆదరణ ఉంటుందని నేననుకోలేదు. అభినందించటానికి ఓ రోజు అతని ఇంటికివెళ్ళాను. చేతుల్లో తల పెట్టుకుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఎదురుగా తన పుస్తకంమీద విమర్శపడ్డ పేపర్లున్నాయి.

"కంగ్రాట్స్" అన్నాను. "ఎందుకు?" అన్నాడు, పేపర్లవైపు చూపించి "ఎంత పేరు, ప్రఖ్యాతి!" అన్నాను. అరనిమిషం ఊరుకుని విషాదంగా నవ్వి అన్నాడు

"ఎస్. మురళీధరరావుది బయాగ్రఫర్. డామ్‌హిమ్!"